క్లుప్తంగా

నేడు ఆకివీడులో గడపగడపకు

ఆకివీడు : స్థానిక నగర పంచాయతీ పరిధిలో సచివాలయం – 3లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు 4వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ కృష్ణ మోహన్ బుధవారం చెప్పారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లు పాల్గొంటారని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరుకావాలన్నారు.

మోషేన్‌రాజును కలిసిన ఆకివీడు సీఐ


శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజును కలిసిన సీఐ సత్యనారాయణ

సాక్షి, భీమవరం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆకివీడు సీఐ సత్యనారాయణ బుధవారం సాయంత్రం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఈ సందర్భంగా మోసేన్‌రాజు సూచించారు.

భీమవరం ఎక్సైజ్‌శాఖ డిపో మేనేజర్‌గా రంగారెడ్డి


భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన రంగారెడ్డి

సాక్షి, భీమవరం: భీమవరం ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ డిపో మేనేజర్‌గా ఎల్ రంగారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రంగారెడ్డి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు.

ఆంధ్రకేసరికి నివాళి

ఆకివీడు : మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ సాధనలో విద్యార్థులు నడుచుకోవాలని ప్రధానోపాధ్యాయుడు విక్రమ్ పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో టంగుటూరి జయంతిని బుధవారం నిర్వహించారు.

పౌష్టికాహార లోపంతో రక్తహీనత

సాక్షి, భీమవరం: మహిళల్లో ఎక్కువగా పౌష్టికాహార లోపాలు, రక్తహీనత కనబడుతున్నాయని వాటిని అధికమించేందుకు ఆరోగ్య విషయంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ బీహెచ్ శ్వేత చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా అధ్యాపకులు, విద్యార్థినులకు హెల్త్ స్క్రీనింగ్ ఫర్ ఉమెన్ ఏ కంప్లీట్ బ్లడ్ ప్రొఫైల్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇన్‌చార్జ్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, కోఆర్డినేటర్ డాక్టర్ పి భువనేశ్వర్, ఎస్ లవ కుమార్, జి శశికళ పాల్గొన్నారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

కాళ్ల : తన భార్య కనిపించడం లేదంటూ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు బుధవారం తెలిపారు. ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం వేంపాడు గ్రామానికి చెందిన తాడి యాకోబు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్య సుకన్య జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి ఆరు నెలల క్రితం ఇండియాకు వచ్చింది. అప్పటినుంచి భార్య భర్తలు తరచూ గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 21న సుకన్య భర్తతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

25 వరకూ ఆధార్ క్యాంప్‌లు

పాలకోడేరు : గ్రామ, వార్డ్ సచివాలయాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నూకల మురళి గంగాధరరావు తెలిపారు. 2016కు ముందు ఆధార్ కార్డులు తీసుకున్నవారు తప్పనిసరిగా అప్డేట్ చేయించుకోవాలన్నారు. ఆధార్ అప్డేట్ కాకుంటే పథకాలు రద్దవుతాయన్నారు. అప్డేట్ కాని ఆధార్ కార్డులు జిల్లాలో 3,85,678 ఉన్నాయని, కొరుకోల్లులో 91 శాతం పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు

వీరవాసరం: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా ఏపీడీ విజయలక్ష్మి తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల రికార్డులను పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీవో కే జ్యోతి, టి ఏ సుధీర్, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతు

- చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కుట్రలను తిప్పికొట్టాలి
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌దిశానిర్దేశం



భీమవరంలో వైఎస్సార్ సీపీ గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని అడ్డుకోవాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ అనేక కుట్రలు పన్నుతున్నారని ఎవరెన్ని కుతంత్రాలు చేసినా ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే అండగా ఉన్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల సంపూర్ణ మద్దతుతో రానున్న ఎన్నికల్లో 175 సీట్లను ఖచ్చితంగా గెలుచుకుంటామని శ్రీనివాస్ దీమా వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు జనసేన పార్టీతో సహా అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుని ప్రజలకు 600కు పైగానే హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా మోసం చేశారని అన్నారు. అందువల్లనే 2019 ఎన్నికలలో ప్రజలు కేవలం 23 సీట్లకే చంద్రబాబును పరిమితం చేశారని వివరించారు. ప్రజలకు అన్నిరకాల ప్రయోజనాలు కల్పిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసి అసత్య ప్రచారంతో మరొకసారి ప్రజలను మోసం చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వివరించాలన్నారు. రోడ్ల నిర్మాణంలో చంద్రబాబునాయుడు చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ నాయకులు వైఎస్ జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని దీనిని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 2019 ఎన్నికలలో భీమవరంలో పవన్‌కల్యాణ్‌పై తన విజయం పార్టీ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలదేనన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, వైఎస్సార్ సేవాదళ్ కన్వీనర్ చిన్నమిల్లి వెంకటరాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, ఏఎస్ రాజు, రేవూరి గోగురాజు, భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏవీఆర్ సభాపతి, జేసీఎస్ కన్వీనర్లు మానుకొండ ప్రదీప్, చెల్లబోయిన సూర్య ప్రకాష్, గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు, కోమటి రాంబాబు, కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, గూడూరి ఓంకార్, గొలగాని సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వేండ్ర విజయదుర్గ, అల్లూరి నాగవల్లి, కానుబోయిన వెంకటరమణ, కందికట్ల ఎడ్వర్డ్, కొప్పర్తి సత్యనారాయణ, కడలి ధర్మారావు, కోళ్ల బాలకృష్ణ, యర్రంశెట్టి శ్రీనివాస్, చికిలే మంగతాయారు పాల్గొన్నారు.

శృంగవృక్షంలో వైఎస్సార్ పొలంబడి


వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు : శృంగవృక్షంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వీఏఏ సత్యనారాయణ వరిలో తెగుళ్లు, పురుగులు వరి దుబ్బులను కటింగ్ చేసే విధానాన్ని రైతులకు చూపించారు. ఎంత మోతాదులో పురుగుమందులు వాడుకోవాలో రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రవికుమార్ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు తినడం వలన ఆరోగ్యం బాగుంటుందన్నారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ద్రవ జీవామృతం తయారుచేసి దానివల్ల ఉపయోగాలు ఎలా తయారు చేసుకోవాలో రైతులకు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గునుపూడి పాండురంగారావు, వీఏఏలు సత్యనారాయణ, పావని, ఊర్మిళ, మండల ఇన్‌చార్జి రవికుమార్, దుర్గారావు, అప్పారావు, శ్రీకళ, రైతులు పాల్గొన్నారు.

డీఎన్ రాజుకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న నిరీక్షణరాజు

కాళ్ల: కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన సంఘ సేవకుడు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నిరీక్షణరాజు సన్ రైజ్ యూనివర్సిటీ – రాజస్థాన్ నుంచి డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. ఈమేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆక్వా కార్మికులు, పేదల కోసం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈనెల 21న గోవాలో నిర్వహించిన సమావేశంలో సన్‌రైజ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రధానం చేసిందన్నారు. ఈ సందర్భంగా కోపల్లె గ్రామస్తులు నిరీక్షణరాజును అభినందించారు.

పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఆకివీడు 20వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం


20వ వార్డులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు : నవరత్నాల అమలుతో పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు విరాజిల్లుతున్నాయని ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారాజు అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం–3లో 20వ వార్డులో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పీవీఎల్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు తమకు ఎంతో అండగా ఉన్నాయని, ఆర్థికంగా తాము బలపడుతున్నామని పలువురు మహిళలు తెలియజేడయంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న సమస్యల్ని కొన్ని వార్డుల్లో ప్రజలు వివరించారు. అందేవారి బోదె, డ్రెయినేజీ, రోడ్డు సమస్యల్ని ప్రస్తావించారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో నగర పంచాయతీ నిధులు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు వెచ్చించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్లలో అభివృద్ధి, పేదల సంక్షేమ పథకాల అమలు చరిత్ర సృష్టించిందని చెప్పారు. ప్రజలు ఆర్థికంగా బలపడినప్పుడే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని భావించి సీఎం వైఎస్ జగన్ నవరత్నాల్ని అమలుజేస్తున్నారన్నారు. నవరత్నాల్ని విమర్శించిన చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ప్రజల్ని మోసగించేందుకు అమలుకాని వాగ్దానాల్ని చేస్తున్నారని ఆరోపించారు. అన్నీ ఉచితంగా ఇస్తామంటూ ఇచ్చిన మేనిఫెస్టో ప్రజల్ని మోసగించడమేనని పీవీఎల్ విమర్శించారు. ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌కు మళ్లీ పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, ఏఎంసీ చైర్మన్ షేక్ రసూల్ బీబీ, గుండా సుందర రామనాయుడు, సచివాలయాల కన్వీనర్ శిరపు శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్ళెం అరుణకుమారి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, గేదల అప్పారావు, తిమ్మారెడ్డి మాధవి, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, గునుకుల కొండయ్య, మోటుపల్లి రాజు, షేక్ హుస్సేన్, కేశిరెడ్డి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి చిరస్మరణీయుడు


భీమవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీవో దాసి రాజు

సాక్షి, భీమవరం: తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులని భీమవరం ఆర్డీవో దాసి రాజు అన్నారు. స్థానిక ప్రకాశంచౌక్‌లో బుధవారం ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజల మనసులో టంగుటూరి చిరస్మరణీయుడిగా నిలిచారని, ఆయన త్యాగం, సాహసం భావితరాలకు ఆదర్శమన్నారు. భీమవరంలో టంగుటూరి విగ్రహాన్ని ఏర్పాటుచేస్తే రూ. 50 వేలు తన వంతు సహాయంగా అందిస్తానని రాజు ప్రకటించారు. టంగుటూరి జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస్, ఉండపల్లి రమేష్ నాయుడు, ఇందుకూరి ప్రసాద్ రాజు, నందమూరి రాజేష్, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

సామరస్యంగా సమస్య పరిష్కరించుకుందాం

వాండ్రంలో దళితులతో సమావేశమైన జాన్సన్


దళితులతో చర్చిస్తున్న మేడిద జాన్సన్ తదితరులు

ఉండి : ఇటీవల వాండ్రంలో లూథరన్ చర్చ్‌పై దాడి చేసిన ఘటనపై దోషులను అరెస్టు చేయాలంటూ దళితులు నిరసన చేపట్టిన నేపథ్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మేడిద జాన్సన్ వారితో సమావేశమయ్యారు. చర్చ్‌పై దాడి దురదృష్టకరమని జాన్సన్ అన్నారు. మతసంబంధమైన విషయాలపై ఆచితూచి అడుగులు వేయాలే తప్ప ఇటువంటి చర్యలకు పూనుకోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందామని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని ఎవ్వరూ తొందరపడవద్దని సూచించారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లి శాంతియుతంగా పరిష్కరించుకుందామన్నారు. న్యాయమైన డిమాండ్లను మా దృష్టికి తెస్తే దానిని పరిష్కరించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మత సామరస్యం, ఆత్మీయ బంధాలు చెడిపోకుండా ఐకమత్యంగా జీవించేందుకు ప్రాధాన్యమివ్వాలని జాన్సన్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని కుల, మతాలకు సమప్రాధాన్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రత్నకుమార్, రాష్ట్ర కార్యదర్శి గుర్రం బెన్హర్, జిల్లా ఉపాధ్యక్షుడు జాకబ్, చిరంజీవి రాజు, శామ్యూల్, కరుణాకర్, స్థానిక పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరల భారం తగ్గించాలి


భీమవరంలో నిర్వహించిన సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

సాక్షి, భీమవరం: నిత్యావసర వస్తువుల ధరలు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ధరలను అరికట్టకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ ప్రభుత్వాలకు హెచ్చరించారు. బుధవారం సీపీఎం భీమవరం పట్టణం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతోపాటు విద్యుత్ సంస్కరణల ద్వారా కరెంట్ చార్జీలు పెంచారని విమర్శించారు. ఈనెల 30 నుంచి సెప్టెంబరు 5 వరకు అధిక ధరలు, నిరుద్యోగంపై దశల వారి ఆందోళనకు సీపీఎం పిలుపునిచ్చిందని బలరామ్ తెలిపారు. ఎం వైకుంఠరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు, డి నాగేశ్వరరావు, కె కృష్ణ, బి చైతన్ ప్రసాద్, బి త్రిమూర్తులు, బంగారు వరలక్ష్మి, నీలాపు అప్పన్న పాల్గొన్నారు.

ఏఎంసీ ద్వారా రైతులకు విస్తృత సేవలు అందించాలి


పీవీఎల్‌ను కలిసిన ఆకివీడు ఏఎంసీ చైర్మన్ షేక్ రసూల్ బీబీ

కాళ్ల : ఏఎంసీ ద్వారా రైతులకు అందుబాటులో ఉండి విస్తృత సేవలు అందించాలని తద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సూచించారు. ఆకివీడు ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన షేక్ రసూల్ బీబీ బుధవారం పెదఅమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో పీవీఎల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆశీస్సులు తీసుకుని ఆయన సమక్షంలోనే చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. పీవీఎల్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం పీవీఎల్‌ను రసూల్ బీబీ శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆకివీడు ఏఎంసీలో ప్రమాణస్వీకారం నిర్వహించినట్లు షేక్ హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో ఆకివీడు మున్సిపాలిటీ చైర్మన్ జామి హైమావతి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్, తోట శివాజీ, షేక్ రఫీ, షేక్ బాబ్జి, ఏఎంసీ కార్యదర్శి బొక్క వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

సంధ్య తల్లిదండ్రులకు పీవీఎల్ పరామర్శ

ఆకివీడు : భర్త చేతిలో కిరాతకంగా హత్యకు గురైన కమల సంధ్య కుటుంబ సభ్యులకు రక్షణ కల్పిస్తామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు, మానవ హక్కుల సంఘ సభ్యురాలు బూసి వినీత హామీ ఇచ్చారు. బుధవారం వారి ఇంటికి వెళ్లి సంధ్య తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా కమల సంధ్య హత్యకు గురైన విషయాల్ని తెలియజేస్తుండగా పీవీఎల్ కంట తడిపెట్టారు. ఆయన మాట్లాడుతూ క్రూరమైన సంఘటనగా పేర్కొన్నారు. హంతకుడికి కఠిన శిక్షపడుతుందన్నారు. బెయిల్‌పై బయటకు వచ్చి మీకు ఫోన్‌చేసినా, బెదిరించినా, మళ్లీ జైలుకు వెళతాడని, కోర్టు తీర్పు కఠిన శిక్షపడే విధంగా ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. మానవ హక్కుల సంఘ సభ్యురాలు వినీత మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాల కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఐసీడీఎస్ సీడీపీఓ వాణీ విజయరత్నం, సూపర్‌వైజర్ రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇస్రో విజయాలు దేశానికి గర్వకారణం


చంద్రయాన్-3 విజయోత్సవంలో పాల్గొన్న ఏబీవీపీ కార్యకర్తలు


చంద్రయాన్-3 విజయవంతం కావాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థుల ర్యాలీ

సాక్షి, భీమవరం: ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఎంతో ఉత్కంఠతో ఎదురు చూసిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. భారతదేశమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు గర్వపడే విధంగా చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడం పై ఇస్రో శాస్త్రవేత్తల, టీం పట్టుదల, కృషిని అభినందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల విజయాలు దేశ ప్రజలకు గర్వకారణంగా నిలుస్తున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

భీమవరంలో విద్యార్థుల ర్యాలీ

సాక్షి, భీమవరం: చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ భీమవరంలో వివిధ విద్యాసంస్థలు, రాజకీయపార్టీల ఆధ్వర్యంలో బుధవారం భీమవరంలో ర్యాలీలు, దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిషాంతవర్మ, ప్రిన్సిపాల్ ఎం జగపతిరాజు, ప్రసాద్ రాజు మాట్లాడుతూ కళాశాల అడ్వైజరీ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ వైవీ కృష్ణమూర్తి చంద్రయాన్‌లో భాగస్వామ్యం కావడం గర్వకారణమన్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావాలని బుధవారం భీమవరంలో బీజేపీ యువమోర్చ ఆధ్వర్యంలో నాయకులు సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు మోడల్ రాకెట్‌తో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎల్‌వీ రమాదేవి, బీవీ శేషగిరిరావు, పీఎస్ శ్రీనివాస్, పైడిరాజు ప్రకాష్,తపన్‌కుమార్ పాండా, కృష్ణభాస్కర్ పాల్గొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో చంద్రయాన్– 3 విజయవంతమైన సందర్భంగా పట్టణంలోని ప్రకాశం చౌక్ వద్ద ర్యాలీ నిర్వహించారు. జిల్లా కన్వీనర్ కాయిత డిన్ను చందు, భీమవరం బాగ్ కన్వీనర్ విష్ణు సింహ, నగర కార్యదర్శి దేవేంద్ర పాల్గొన్నారు

చంద్రయాన్– 3 విజయవంతానికి పూజలు

వీరవాసరం: చంద్రయాన్– 3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ బుధవారం ఉదయం పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రయోగ కార్యక్రమాన్ని టీవీల్లో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

భారత్ మేథస్సుకు చంద్రయాన్-3 నిదర్శనం

ఆకివీడు : భారత్ మేథస్సుకు చంద్రయాన్-3 నిలువుటద్దంగా నిలిచిందని, మన దేశం కూడా అగ్రరాజ్యాలలో ఒకటిగా నిలుస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు అన్నారు. చంద్రయాన్-3 విజయం పట్ల పలు చోట్ల విద్యార్థులు, నాయకులు, ప్రజలు ఆనందోత్సాహాలతో స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్ విజయం తరువాత అతిపెద్ద విజయం చంద్రయాన్-3 అని పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పెదకాపవరం జెడ్పీ స్కూల్ హెచ్ఎం కాళహస్తేశ్వరుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో చంద్రయాన్-3 ప్రయోగం, సక్సెస్ నూతనోత్సాహాన్ని, కొత్త ఆలోచనల్ని కల్గిస్తుందని చెప్పారు. విద్యార్థులు స్క్రీన్‌పై చూసినంత చేపూ ఉత్కంఠగా, ఉత్తేజంగా తిలకించారని చెప్పారు. అనంతరం విద్యార్థులు స్వీట్లు పంచిపెట్టారు. జయహో ఇస్రో శాస్త్రవేత్తలు అంటూ నినదించారు.

విద్య ద్వారానే సమాజం అభివృద్ధి

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. వీరవాసరం యానాదుల కాలనీలో విద్యార్థులకు బుధవారం ఉచితంగా సైకిల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను బడిలో చేర్పించి వారికి ఉచితంగా ఏడు సైకిళ్లు, పాఠశాలకు ఎల్‌సీడీ టీవీ అందజేసిన ఆర్డీఓ దాసిరాజుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆర్డీవో దాసిరాజు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సూచించిన మార్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు ఆర్డీఓ దాసిరాజు– సౌజన్య దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం సుందర్రాజు, ప్రధానోపాధ్యాయుడు జె శ్రీనివాసు, గెద్దం భాస్కరరావు, సుధాకర్, సత్యనారాయణ, ప్రసాద్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం అర్బన్: సెప్టెంబర్ 9 జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ కె. జ్యోతి అన్నారు. భీమవరం మండలంలోని బేతపూడిలోని సచివాలయం వద్ద బుధవారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ లాయర్ కె. జ్యోతి మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న సివిల్ తాగాదాలు, పోలీస్ కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద బీమాకు సంబంధించిన కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర ఎన్నో కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుమల యామిని దేవి, సెక్రటరీ ఎన్ లక్ష్మీ అలువేలుమంగ తాయారు, న్యాయవాది డి. రవికిరణ్, పారాలీగల్ వలంటీర్ ఎమ్ కమల్ రాజు పాల్గొన్నారు.

డీఎన్నార్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

సాక్షి, భీమవరం: భీమవరంలో పేదలకు విద్యను అందుబాటులోనికి తీసుకురావడానికి స్వతంత్ర్య పోరాట యోధులు, మేధావులు కలిసి 1945లో ఏర్పాటు చేసిన డీఎన్నార్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడానికి యాజమాన్యం సిద్ధమవడం దారుణమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె ప్రసన్నకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం భీమవరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 71 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డీఎన్నార్ కళాశాల వేలాది మందికి విద్యను అందించిందన్నారు. దాతల సహకారం, ప్రభుత్వ నిధులతో రూ.2,500 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలు ల్యాబ్స్, ఇండోర్ స్టేడియం, గ్రంథాలయం, క్రికెట్ గ్రౌండ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే కాలేజీ కొంత భాగంలో ప్రైవేట్ కాలేజీ నడుపుతున్నారని యాజమాన్యానికి ఎయిడెడ్‌లో నడపడం చేతకాకపోతే ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.